క్లుప్తంగా

వర్షం రాకతో సేదతీరిన ప్రజలు



దోర్నాలలో కురుస్తున్న వర్షం

పెద్దదోర్నాల: గత కొద్ది రోజులుగా మండుటెండలు, తీవ్రమైన ఉక్కపోతలతో అల్లాడిన మండల ప్రజలు ఆదివారం కురిసిన వర్షానికి కొంతమేర సేద తీరారు. గత కొద్ది రోజులుగా ప్రచండ భానుడి తీవ్రతతో బెంబేలెత్తి బయటకు వచ్చేందుకు సైతం భయపడిన మండల ప్రజలు అకస్మాత్తుగా కురిసిన వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు. గత కొన్ని రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో రోడ్లపైకి సైతం వచ్చేందుకు భయపడిన మండల ప్రజలు ఆదివారం కురిసిన వర్షంలో సేద తీరారు. గతంలో తీవ్రమైన ఎండలు అల్లాడించటంతో వీధులన్నీ సాయంత్రం 6 గంటల వరకు నిర్మానుష్యంగా కనపడేవి. అరగంట పాటు కురిసిన వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారిపోయింది. కాగా కురిసిన వర్షంతో మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాల్లో పలు వీధులు వర్షపు నీటితో నిండి మడుగులను తలపించాయి. డ్రైనేజీ కాలువలో నీటితో నిండి పోవటంతో పంచాయతీ సిబ్బంది కాలువలను శుభ్రం చేసే పనిలో లీనమయ్యారు.

వీధి నాటకాల ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందాలు

పెద్దదోర్నాల: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ కళాజాత బృందాలచే మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక హాండ్సప్ కమ్ ప్యాషన్ సొసైటీ పీయు ఆధ్వర్యంలో ప్రాజెక్టు డైరక్టర్ ఆనంద్, బెంజిమెన్‌ల ఆధ్వర్యంలో కళాజాత బృందాలతో అవగాహన నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన కార్యక్రమంలో వీధి నాటకాలను ప్రదర్శించి హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది ? ఎలా రాదు ?, ఎలా వ్యాపించదు ? అనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రేణుకాదేవి, తిరుమలయ్య, శ్రావణి, రాణి, భవాని, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి కళలకు ప్రోత్సాహం అందిస్తాం



నృత్య కళాకారిణిని సత్కరిస్తున్న శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

దర్శి(కురిచేడు): కూచిపూడి కళలకు ప్రోత్సాహం అందిస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో దర్శనాపురి కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న నాటకపోటీల ముగింపు సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆదివారం రాత్రి ఆయన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు పాశ్చాత్య సంస్కృతిలో సమాజం కొట్టుమిట్టాడుతుందని, అలాంటి సందర్భంలో దర్శిలో అంతర్జాతీయ కూచిపూడి కళాకారిణి డాక్టర్ స్వాతి సోమనాథ్ ఆధ్వర్యంలో ఇటువంటి కూచిపూడి నృత్య కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, ధనిరెడ్డి వెంకటరెడ్డి, పానుగంటి కోటేశ్వరరావు, కళాపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై వర్షం నీరు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో సిమెంట్ రోడ్డుపై వర్షం నీరు నిలిచి రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందిగా మారింది. రహదారికి ఇరువైపుల కాలువలు లేకపోవడంతో వర్షం నీరు ఇళ్ల మధ్యలో రోజులకొద్దీ నిల్వ ఉంటాయి. గ్రామానికి ప్రధాన రహదారిపై వర్షం నీరు నిలిచి చిన్నపాటి కుంటను తలపిస్తోంది. ఊరందరూ ఇదే రహదారి మీదుగా బస్టాండ్, పొలాలకు వెళ్లేందుకు ప్రజలు, ద్విచక్ర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రహదారిపై రోజుల కొద్దీ నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ దారిలో వెళ్లే వారందరు మురుగునీటిలోనే నడుచుకుంటు వెళ్లాల్సి వస్తోంది. దుర్వాసన వెదజల్లడంతో ఇళ్లలో ఉండాలన్న, భోజనాలు చేయాలన్న చాలా ఇబ్బందిగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డుపై గుంత పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మోటార్ల దొంగలు.. పోలీసులకు చుక్కలు !



విద్యుత్ మోటార్ చోరీ జరిగిన ప్రదేశాన్ని చూపిస్తున్న రైతులు



సాగర్ కాలువలో మోటార్ పోయి పైపు మాత్రమే మిగిలిన దుస్థితి

- మండలంలో చోరీకి గురవుతున్న విద్యుత్ మోటార్లు, కేబుళ్లు
- వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న రైతులు
- అరికట్టడంలో విఫలమవుతున్న పోలీసులు
- ఎండిపోతున్న మొక్కజొన్న, దోస, మిరప పంటలు

కురిచేడు: ఒక పక్క పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు నానా ఇబ్బందులు పడుతుంటే.. మరో పక్క దొంగల పోటుతో భయాందోళన చెందుతున్నారు. మండలంలోని పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లు, కేబుల్ వైర్లను దొంగిలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు దుండగులు. ఇంత జరుగుతున్నా పోలీసులు చోరీలను అరికట్టడంలో విఫలమవుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నాగార్జున సాగర్ కుడి కాలువపై రైతులు పంట పొలాలకు నీరు పెట్టుకునేందుకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లు, కేబుల్ వైర్లు వరుసగా చోరీ జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో సుమారు 11 మంది రైతులకు చెందిన విద్యుత్ మోటార్‌లు, కేబుల్ వైర్లు చోరీ జరిగాయి. దీంతో సుమారు రూ. 5 లక్షల పైనే నష్టం వాటిల్లిందని రైతులు పేర్కొన్నారు. ప్రతి ఏడాది విద్యుత్‌మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు జరగడం మండలంలో ఆనవాయితీగా మారింది. అదే క్రమంలో ఈ ఏడాది కూడా పంటలు చివరి దశకు చేరిన తరువాత మోటార్ల దొంగతనాలు జరుగుతున్నాయి.

నష్టపోయిన రైతుల వివరాలు..

☛ మండలంలోని శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన కుందురు వెంకటరెడ్డికి చెందిన విద్యుత్ మోటారు, కేబుల్ చోరీ జరిగి సుమారు రూ.70 వేల నష్టం వాటిల్లింది.

☛ నుసుం బజార్‌కు చెందిన గుంటక నాగిరెడ్డికి చెందిన మోటారు, కేబుల్ చోరీ చేశాడు. దీంతో రూ.35 వేల నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

గొల్లపాలెం గ్రామాన్ని టార్గెట్ చేసిన దొంగలు..

దొంగలు గొల్లపాలెం గ్రామాన్ని టార్గెట్ చేశారు. ఎక్కువగా ఈ గ్రామంలోనే చోరీలు చేశారు. గ్రామానికి చెందిన శీలం వెంకట గిరిబాబుకు చెందిన విద్యుత్ మోటారు, కేబుల్ చోరీ జరిగి సుమారు రూ.35 వేల నష్టం జరిగింది. అదే గ్రామానికి చెందిన దుగ్గ రామకోటిరెడ్డికి చెందిన విద్యుత్ మోటారు, కేబుల్ చోరీ జరిగి సుమారు రూ.35 వేల నష్టం వాటిల్లింది. అదే గ్రామానికి చెందిన ముచ్చా శ్రీనువాసులకు చెందిన విద్యుత్ మోటారు చోరీ చేశారు. సుమారు రూ.30 వేల నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు. అదే గ్రామానికి చెందిన ముచ్చా గిరిబాబుకి చెందిన విద్యుత్ మోటారు, కేబుల్ చోరీ జరిగి సుమారు రూ.35 వేల నష్టం జరిగింది. అదే గ్రామానికి చెందిన బొరిగర్ల మసలయ్యకు చెందిన మోటారు చోరీ జరిగి రూ.30 వేల నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

☛ కాటంవారి పల్లె గ్రామానికి చెందిన నుసుం కృష్ణారెడ్డి విద్యుత్ మోటారు, కేబుల్ చోరీ జరిగి సుమారు రూ.1 లక్ష నష్టం వాటిల్లింది. ఇదే గ్రామానికి చెందిన పోతిరెడ్డి చంద్రారెడ్డి విద్యుత్ మోటారు, కేబుల్ వైరు చోరీ చేశారు. సుమారు రూ.35 వేల నష్టం జరిగిందని రైతులు తెలిపారు.

☛ కురిచేడుకు చెందిన ఇందూరి సుబ్బారెడ్డి, దూలం వెంకటరెడ్డిలకు చెందిన కేబుల్ వైరు రెండు దఫాలుగా చోరీ జరగడంతో రూ. 20 వేలు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

☛ బాపనపల్లి వెంకటనర్సయ్యకు చెందిన విద్యుత్ మోటార్, కేబుల్ చోరీ జరిగి సుమారు రూ.35 వేల నష్టం జరిగింది. ఈ చోరీలతో రైతులంతా సాగు చేస్తున్న మొక్కజొన్న, దోస, మిరప పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు దొంగల ఆట కట్టించాలని, లేకపోతే రాబోయే ఖరీఫ్ సీజన్ పంటలన్నీ బీడుగా మారే పరిస్థితి ఉందని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఆరుగాలం కష్టపడి దొంగల నోట్లో పెట్టాం..



ఆరుగాలం కష్టపడి పండించగా వచ్చిన ఫలితం దొంగల నోట్లో పెట్టినట్లయింది. అందినకాడల్లా అప్పులు చేసి పంటలను పండించినా పరులపాలు కావడంతో చేసిందంతా వృథా అయ్యింది. మిగతా పొలాల్లో వర్షాధారం వలన పంటలు సరిగ్గా పండ లేదు. కాలువ కింద సాగు చేసుకున్నాం, కాస్త పరవాలేదనుకుంటే దొంగలపాలైంది.

– బొరిగర్ల ముసలయ్య, రైతు

ఏటా ఇదే పరిస్థితి..



ప్రతి ఏటా ఎండా కాలంలో దొంగలు వచ్చి మోటార్‌లు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు దొంగతనాలు చేస్తున్నారు. పంటలను ఉదయం నుంచి రాత్రి వరకు పొలాల్లోనే ఉంటున్నాం. కాని మరునాడు ఉదయం వచ్చేసరికి మోటార్లు, తీగలు పోవడం బాధగా ఉంటోంది. అప్పులు చేసి తెచ్చుకున్న మోటార్లు చోరీకి గురవడంతో నష్టపోతున్నాం.

– శీలం వెంకట గిరిబాబు, రైతు

దొంగలను అరికట్టకపోతే ఇబ్బందే..



పొలాలను బట్టి తినీ తినక పంటలు పండుతాయనే ఆశతో అప్పు చేసి మోటార్లు కొనుగోలు చేశాం. ఏటా రెండు, మూడు సార్లు దొంగతనాలు చేస్తుంటే రైతు బతకడం కష్టంగా ఉంది. దొంగలను అరికట్టకపోతే పంటలు సాగు చేయలేం. దీనిపై పోలీసులు గట్టి చర్యలు తీసుకుని దొంగతనాలు అరికట్టాలి.

– గుంటక నాగిరెడ్డి, రైతు

చెన్నారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



చెన్నారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, నాయకులు



ఎదురు చెన్నారెడ్డి (ఫైల్)

దర్శి(కురిచేడు): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మరణించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తకు నివాళులర్పించారు. దర్శికి చెందిన ఎదురు చెన్నారెడ్డి (52) కారులో చీరాల శనివారం వెళ్లి పనిముగించుకుని తిరుగు ప్రయాణం అయ్యాడు. చినగంజాం, ఉప్పుగుండూరు గ్రామాల మధ్య సాయిబాబా మందిరం సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈఘటనలో చెన్నారెడ్డికి రక్తగాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యంలో చెన్నారెడ్డి మృతి చెందాడు. మృతదేహాన్ని ఆదివారం రాత్రి దర్శిలోని తన నివాసానికి తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివప్రసాద్‌రెడ్డి వెంట ధనిరెడ్డి వెంకటరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ యూత్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి,శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

- మొక్కుబడి కార్యక్రమానికి హాజరైన బూచేపల్లి, వెంకాయమ్మ

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు మెట్టీల బాలరాజు, పి. విజయలక్ష్మి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ బ్రాహ్మణ అర్చకుడు కామేశ్వరశర్మ అమ్మవారికి అభిషేకాల, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు కానుకలు సమర్పించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు తీర్చే కల్పవల్లిగా పిలువబడే అమ్మవారిని సందర్శించడానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం పక్కన ఉన్న పుట్ట, నాగ శిలలను భక్తులు, మల్లికార్జున స్వామి వారిని పూజించారు. ఆలయ ఈవో జి.వాసుబాబు, చైర్మన్ కే.గురుబ్రహ్మం, ఏఆర్ కే ప్రసాద్ సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయాన్ని పర్యవేక్షించారు. తురకపాలెం గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు కుమ్మిత జయరాం రెడ్డి మొక్కుబడి కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. వారి వెంట తాళ్లూరు, ముండ్లమూరు వైఎస్సార్ సీపీ పార్టీ ప్రధాన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు

వైఎస్సార్ సీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ



రామస్వామిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

పెద్దారవీడు: టీడీపీ నాయకులు దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకులను స్థానిక వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పరామర్శించారు. మండలంలోని పుచ్చకాయలపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మారంరెడ్డి రామస్వామిరెడ్డిపై టీడీపీ నాయకులు దాడి చేశారు. అనంతరం అక్రమ కేసు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం రాత్రి నాయకుడి ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యంగా ఉండాలన్నారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కలనూతల గ్రామంలో నన్నూరి కాశిరెడ్డి, పెద్దారవీడు గ్రామంలో ఈదర రజనీకాంత్‌రెడ్డి, ఏనుగులదిన్నెపాడు గ్రామంలో గుమ్మా చిన్న ఆవులయ్య కుమారుడు, మద్దలకట్ట గ్రామంలో తంగిరాళ, దొడ్డా వారి వివాహ శుభ కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆయన వెంట ప్రజా ప్రతినిధులు, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు

దొనకొండ: కూటమి ప్రభుత్వంలో గ్రామాలకు బస్సు సౌకర్యం లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పొదిలి నుంచి వయా ఆరవల్లిపాడు మీదుగా వద్దిపాడు, సంగాపురం, వీరేపల్లి, కలివెలపల్లి గ్రామాలను కలుపుకుని గజ్జలకొండ, పోతలపాడు, గానుకపెంట, మార్కాపురం లేదా వయా దొనకొండ మీదుగా వెంకటాపురం, ఎస్సీపాలెం, సంగాపురం, వీరేపల్లి, కలివెలపల్లి గ్రామాల మీదుగా గజ్జలకొండ నుంచి మార్కాపురం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గతంలో మార్కాపురం నుంచి వయా గజ్జలకొండ మీదుగా కలివెలపల్లి, సంగాపురం, ఆరవల్లిపాడు, దొండపాడు, పెదన్నపాలెం మీదుగా దొనకొండకు బస్సు సౌకర్యం ఉండేది. నేడు బస్సు సౌకర్యం లేక పోవటంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. మండల ప్రజలు దొనకొండ రావాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలో ప్రయాణం ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో ప్రయాణాలు ఎన్నోసార్లు ప్రమాదాలకు గురయ్యాయి. అంతేకాకుండా విద్యార్థులు జూన్ నెల నుంచి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రావాలంటే ఆటోలు ఆశ్రయించక తప్పదు. 3 నెలలకు ఒకసారి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో ఆర్టీసీ అధికారులు హాజరవుతున్నారు. ఎన్నోసార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులను అడిగినా సరే అంటున్నారు కాని మరుసటి రోజు మరిచిపోతున్నారు. ఇప్పటికైనా ప్రజలను, విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఆర్టీసీ బస్సు (ఫైల్)

దొనకొండ వెళ్లాలంటే నానా ఇబ్బందులు..



మా పంచాయతీలోని గ్రామాల నుంచి దొనకొండ మండల కేంద్రానికి ప్రతి రోజూ పనుల నిమిత్తం వెళ్లాల్సి వస్తుంది. గతంలో బస్సు సౌకర్యం ఉండేది. నేడు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలు ఆశ్రయించక తప్పడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ పొదిలి డిపో లేదా మార్కాపురం డిపో అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలి.

– నూనె సరోజా వెంకటరెడ్డి, సర్పంచ్, కలివెలపల్లి

చల్లగా చూడమ్మా పోలేరమ్మ తల్లి



బోనాలతో అమ్మవారి దర్శనానికి వెళ్తున్న భక్తులు

పుల్లలచెరువు:

చల్లగా చూడమ్మా తల్లీ.. పోలేరమ్మ తల్లీ అంటూ మండలంలోని నరజాముల తండాలో ఆదివారం బోనాల పండుగ ర్వహించారు. తండాలో గ్రామ పెద్దల సహకారంతో తండాలోని మొత్తం బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా బయలుదేరి పోలేరమ్మ తల్లి దర్శనం చేసుకుని బోనాలు సమర్పించారు. గతంలో ఎప్పుడు లేని విధంగా మహిళలు విరవిగా పాల్గొని సంప్రదాయ దుస్తులు ధరించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



సంప్రదాయ దుస్తులు ధరించి బోనాన్ని ఎత్తుకున్న గిరిజన మహిళలు

కార్మికులు, కర్షకుల పక్షాన పోరాడేది ఎర్ర జెండానే



త్రిపురాంతకంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు



దోర్నాలలో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దదోర్నాల: కార్మికుల, కర్షకుల పక్షాన పోరాడేది ఎర్ర జెండానేనని నియోజకవర్గ కార్యదర్శి దేవెండ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఐ 5వ మండల మహాసభకు ఆరవీటి రాముడు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల, కర్షకుల పక్షాన ఎర్ర జెండా పోరాడుతుందని, దేశ వ్యాప్తంగా కుల, మత, వర్గ రహిత సమాజం కోసం నిరంతరం ప్రజల పక్షాన ఎర్ర జెండా పోరాడుతుందన్నారు. డిసెంబర్ 26 నాటికి 100 సంవత్సరాలు నిండిన సందర్భంగా పార్టీ అట్టడుగు వర్గాల ప్రజలను చైతన్యవంతులను చేసి వారి ద్వారా నూతన సమాజాన్ని నిర్మాణం కోసం పాటు పడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు బాణాల రామయ్య, మండల కార్యదర్శి విశ్వరూపాచారి, దళిత హక్కు పోరాట సమితి జిల్లా అధ్యక్షులు పూర్ణకంటి తిరుమలయ్య, పానుగంటి మౌళాలి తదితరులు పాల్గొని జెండా ఆవిష్కరించారు.

ఘనంగా సీపీఐ మహా సభలు..

త్రిపురాంతకం: మండలంలో గాంధీనగర్ గ్రామంలో సీపీఐ శాఖ మహా సభలను మండల కార్యదర్శి బాణాల రామయ్య అధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మన్నెం తిరుపతయ్య సీపీఐ జెండా ఆవిష్కరించారు. నియోజకవర్గం కార్యదర్శి డి శ్రీనివాస్ మాట్లాడుతూ వంద సంవత్సరాలు చరిత్ర కలిగిన పార్టీలో మనందరం సభ్యులు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్మికులు, రైతు పరిరక్షణ చట్టలను నిర్వీర్యం చేయాలనుకునే కేంద్ర ప్రభుత్వ వైఖరిని తిప్పికొట్టాలని తెలిపారు. నూతన కమిటీ కార్యదర్శి కురేటి అచ్చమ్మ, సహాయ కార్యదర్శి పోలుదాసు భూలక్ష్మి, నూర్జహాన్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బంగారు నరసింహాలు, మన్నెం తిరుపతయ్య, కురేటి వెంకటేశ్వర్లు కొమ్ము చంద్రమ్మ, రిబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.